www.navatelangana.com

నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

శుక్రవారం 03 మార్చి 2023

చికిత్స పొందుతూ రైతు మృతి

నవతెలంగాణ-ఉట్నూర్

పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గిరిజన రైతు మృతి చెందిన సంఘటన గురువారం తెల్లవారుజామున మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన చౌహన్ రమేష్(55) తనకున్న 5 ఎకరాల భూమితో పాటు మరో 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఈ సంవత్సరంలో కురిసిన అధిక వర్షాల కారణంగా సాగు చేసిన పంట దెబ్బతింది. వచ్చిన కొద్దిపాటి పంటకు చేసిన 5లక్షల అప్పులు ఎలా తీర్చలోనని దిగులు చెందేవాడు. బుధవారం చేనులో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కి తరలించి వైద్యం అందిస్తున్న క్రమంలో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

9 మంది నాయకుల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ - బెజ్జూర్

ఆదివాసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సోయం చిన్నయ్య, బీఎస్‌పీ సిర్పూర్ తాలుకా ఇన్‌చార్జి హర్షద్ హుస్సేన్‌తో పాటు మరో ఏడుగురు బీఎస్‌పీ కార్యకర్తలను ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు అరెస్టు చేశారు. రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు బీఎస్‌పీ మద్దతు ఉంటుందని ప్రకటించడంతో నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోయం చిన్నయ్యను పెంచికల్‌పేట్, హర్షద్ హుస్సేన్‌ను కౌటాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరో ఏడుగురు కార్యకర్తలను బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఇటీవల ఆదివాసులపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తహసీల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని ప్రకటించడంతో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం



నవతెలంగాణ - సిర్పూర్(టి)

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకూ పోరాటం ఆపేది లేదని సీఐటీయూ నాయకులు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. మూడు రోజుల సమ్మెలో భాగంగా గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సీడీపీఓ విజయలక్ష్మికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలందరూ బడుగు బలహీన వర్గాలకు చెందిన వారేనన్నారు. 40 ఏండ్లకు పైగా పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారని, అయినా ప్రభుత్వం మాత్రం వీరిని గుర్తించడం లేదన్నారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలు అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాయన్నారు. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాల్లో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నాయని తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లను టీచర్‌గా పేరు మార్చారు తప్ప ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా వేతనాలు, ఇతర సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు ఉమా, కార్యదర్శి జిజియాబాయి, కౌటాల, బెజ్జూర్, సిర్పూర్ మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

జైనూర్ : ఐసీడీఎస్ రక్షణ, అంగన్‌వాడీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఈ నెల 3న కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల సమస్యలపై ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సీడీపీఓ ఇందిరాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల ఉపాధికి నష్టం కల్పించే చర్యలను మానుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు జంగుబాయి, కార్యదర్శి కళాబాయి, కోశాధికారి కమలాబాయి, ఉపాధ్యక్షురాలు తార, కమల, విజయమాల పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త సమ్మె రెండో రోజైన గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుండి ఐసీడీఎస్ కార్యాలయం వరకు అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టి, కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ త్రివేణి మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను బలహీనపర్చే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం వినోద, వై అరుణ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



జైనూర్‌లో..



కాగజ్‌నగర్‌లో..

ఘనంగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - జైనూర్

జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదిన వేడుకలను గురువారం బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 40 మంది యువకులు రక్తదానం చేశారు. అదేవిధంగా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అన్నదానంతో పాటు పెన్నులు, పెన్సిళ్లు ఉచితంగా అందజేశారు. లింగాపూర్ మండల కేంద్రంలో మార్కెట్ వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు ఇంటి ఆవరణలో సిర్పూర్(యు) జెడ్పీటీసీ కోవ అరుణ, ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. లింగాపూర్ మండల కేంద్రంలో ఎంపీపీ అడె సవిత, ప్రేమ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆత్రం అనిల్, వైస్ ఎంపీపీ ఆత్మారాం ఆధ్వర్యంలో, సిర్పూర్(యు) మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి, స్వీట్లు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబూతాలిబ్, ఎంపీపీ కుమ్ర తిరుమల, వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్, సహకార సంఘం చైర్మన్ కొడప హన్నుపటేల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఇంతియాజ్‌లాల, తొడసం ధర్మారావు, సర్పంచ్‌లు మెస్రం పార్వతి లక్ష్మణ్, మడావి భీంరావు, మెస్రం గోవింద్‌రావు, మెస్రం నాగోరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆత్రం శంకర్, కనక గంగారాం, బీఆర్ఎస్ నాయకులు పెందూర్ లచ్చు, జెన్నవార్ పవన్, మెస్రం అంబాజీ, కైదర్, కబీర్, దత్తు, ఆదివాసీ మిత్రా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

నార్నూర్ : ఎమ్మెల్యే ఆత్రం సక్కు పుట్టిన రోజును బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్ కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. పుట్టిన రోజు సందర్భంగా కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కోసం ఉచితంగా 50 బెంచీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు కష్టపడి కాకుండా, ఇష్టపడి చదివి పైకి ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, నాయకులు యునూస్ అక్బాని, మండల పార్టీ అధ్యక్షుడు హన్మంత్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావు, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, మెస్రం శేఖర్ బాబు, సర్పంచులు యుర్వేత రూపదేవ్, మడావి రూపదేవ్, ఆత్రం పరమేశ్వర్, ప్యాక్స్ డైరెక్టర్ కాంతారావ్ దుర్గే, కనక ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్, కళాశాల ఇన్‌ఛార్జి బాలాజీ కాంబ్లే, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రమదానంతో గుంతలు పూడ్చిన సామాన్యుడు

నవతెలంగాణ - కౌటాల

మండలంలోని చింత ఒర్రె వద్ద గల కల్వర్టుకు ఇరువైపుల రోడ్డు కుంగిపోయి పెద్ద గుంతలు అయ్యాయి. కౌటాల నుండి సిర్పూర్ వైపు వెళ్లే వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గమనించిన మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన గోగర్ల పద్మాకర్ కౌటాలకు చెందిన ఎలుములె సంతోష్‌తో కలిసి గురువారం గుంతలను మొరం తవ్వి వేసి పూడ్చివేశారు. గతంలో కూడా పద్మాకర్ గ్రామ రోడ్డు గుంతలు పడి ఉండగా తానే స్వయంగా మొరం, కంకర వేసి గుంతలు పూడ్చిన ఘటనలు ఉన్నాయి. ఈ రోడ్డు గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు నడుస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో తాను సంతోష్‌తో కలిసి పక్కనే ఉన్న మొరం తవ్వి గుంతలను పూడ్చినట్టు పద్మాకర్ తెలిపారు.

5న గురుకుల ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ - సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి ఈ నెల 5న పరీక్షలు నిర్వహిస్తున్నట్టు డీసీఓ పోలోజు బాల్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందు హాల్‌టికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు.

11, 12న భారత్ బచావో జాతీయ సదస్సు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 11, 12 తేదీలలో న్యూఢిల్లీలోని హెచ్‌కెఎస్ సుర్జిత్ భవన్‌లో నిర్వహించే భారత్ బచావో జాతీయ సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ పార్టీ జిల్లా కార్యదర్శి గోగర్ల తిరుపతి ఒక ప్రకటనలో కోరారు. దేశంలో మతోన్మాద ఫాసిజం రోజు రోజుకు పెరుగుతోందని, దీనిని ఎదుర్కొనని పక్షంలో భవిష్యత్తు తరాలకు ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. ఈ తరుణంలో నిర్వహించే భారత్ బచావో జాతీయ సదస్సుకు జిల్లా నుండి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సామూహిక లైంగికదాడి కేసులో ఏడుగురి అరెస్ట్

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

గత నెల 25న కాగజ్‌నగర్ మండలానికి చెందిన ఓ యువతిని మాయమాటలు చెప్పి కాగజ్‌నగర్‌కు తీసుకొచ్చి సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ వెల్లడించారు. సదరు యువతిపై ముగ్గురు యువకులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని, ఈ ముగ్గురితో పాటు వీరికి సహకరించిన మరో యువకుడు, ముగ్గురు మహిళలపై 376 సెక్షన్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు.

గ్యాస్ ధరల పెంపుదలకు నిరసనగా నేడు బీఆర్ఎస్ ధర్నా

నవతెలంగాణ-లక్ష్మణచాంద

గ్యాస్ ధరలకు పెంపుదలకు నిరసనగా శుక్రవారం ఉదయం 10 గంటలకు లక్ష్మణచాంద మండల కేంద్రంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బీఆర్ఎస్ మండల కన్వీనర్ కోరిపెల్లి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి మండల బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, డైరెక్టర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ, అనుబంధకమిటీలు, గ్రామ అధ్యక్షులు, రైతుబంధు గ్రామా అధ్యక్షులు, మహిళ ప్రతినిధులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి



నవతెలంగాణ - జైనూర్

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి అన్నారు. గురువారం సిర్పూర్(యు) మండలంలోని కోహినూర్(కె) ప్రభుత్వ ఆశ్రమ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నుండి వచ్చే అన్ని సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణులయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ద్వారా పాఠశాలకు సంబంధించిన సౌకర్యాలు, వసతులు, భోజనాన్ని తనిఖీ చేశారు. వంట గది, స్టోర్ గదిలో నిల్వ ఉన్న మెనూ నాణ్యమైన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం స్వయంగానే పిల్లలతో కలిసి భోజనం చేశారు. మొదటిసారిగా పాఠశాలకు రావడం వల్ల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల బృందం ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దేవ్‌సింగ్, వార్డన్ పోసుబాయి, ఉపాధ్యాయులు ఆత్రం శంకర్, మోతిరాం పాల్గొన్నారు.

ఒక్క పేదోనికి డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వలేదు : కాంగ్రెస్



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లలోనే ప్రజలు కాలం వెల్లదీస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఏ ఒక్క పేదోనికి డబుల్ బెడ్‌రూమ్ ఇవ్వలేదని ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. గురువారం హాథ్ సే హాథ్ జోడు యాత్రలో భాగంగా దుర్గానగర్ కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ప్రస్తుత ప్రభుత్వాల పాలనను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ వరుసగా రెండవ సారి కూడా అధికారంలోకి వచ్చినా ప్రజలకు ఎలాంటి లాభం చేకూర్చలేదని అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారం చేపట్టి ప్రజ సమస్యలను గాలికి వదిలేశారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లే ఉన్నాయని, డబుల్ బెడ్ రూం ఎక్కడ ఇచ్చారని ప్రశ్నించారు. నెలకు 20 నుంచి 50 రూపాయలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరను 1250 రూపాయలకు చేసిందన్నారు. రెండు ప్రభుత్వాలకు బుద్ధి చెప్పుడు కోసం కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగేష్, శ్రీధర్, సంతోష్, చంద్రశేఖర్, మోతిరామ్, రాములు, రఘువంశీ పాల్గొన్నారు.

'మేము చెప్పిందే నిజమైంది'

- వరిధాన్యం అక్రమ తరలింపుపై హరీష్‌బాబు వ్యాఖ్య
- ధాన్యం తరలింపులో ప్రధాన సూత్రధారులు ఎమ్మెల్యే, ఎంసీ చైర్మన్‌లే



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గంలోని రైస్ మిల్‌ల నుండి వరి ధాన్యం తూర్పుగోదావరి జిల్లా మండపేటకు తరలుతోందని నాలుగు నెలల క్రితం తాము చెప్పినా అధికారులు పట్టించుకోలేదని, ఇపుడు దొరికిన వరిధాన్యం లారీ తమ ఆరోపణలను నిజం చేసిందని బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు స్పష్టం చేశారు. బుధవారం రాత్రి అక్రమంగా లారీలో తరలిస్తున్న వరి ధాన్యం లారీని రెవెన్యూ అధికారులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గురువారం లారీ వద్దకు వెళ్లి అందులోని వరిధాన్యాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. ప్రభుత్వం రైస్‌మిల్లర్లకు సరఫరా చేసే గోనెసంచులలోనే వరిధాన్యాన్ని తరలిస్తూ పట్టుబడడం పట్ల నాయకులు విస్మయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీష్‌బాబు మాట్లాడుతూ కనీసం సంచులు కూడా మార్చకుండా, ఆ సంచులపై కవర్లు కూడా కప్పకుండా బహిరంగంగా వరిధాన్యాన్ని మండపేటకు తరలిస్తుండడం ఇక్కడి అవినీతి వ్యవహారాన్ని బట్టబయలు చేస్తోందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్‌లు రైస్‌మిల్లర్లను సిండికేట్‌గా తయారుచేసి వారిచే ఈ అక్రమాలు చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం మిల్లింగ్ కోసం మిల్లర్లకు సరఫరా చేసే వడ్లను నేరుగా రైస్ మిల్లర్లు మండపేటకు తరలిస్తూ లక్షలు, కోట్లు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి మళ్లీ వాటిని రీ సైక్లింగ్ చేసి తిరిగి ఎంఎల్ఎస్ పాయింట్లకే ఆ బియ్యాన్ని తరలిస్తూ రెండు వైపులా అక్రమార్జనకు పాల్పడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే నిర్వహించే అన్నదాన సత్రానికి బియ్యం ఇస్తున్నారనే ఒకే ఒక సాకుతో రైస్ మిల్లర్ల అక్రమాలకు ఎమ్మెల్యే వత్తాసు పలుకుతూ ప్రభుత్వానికి, ప్రజలకు నష్టం చేకూరుస్తున్నారని విమర్శించారు. దీనిపై నూతనంగా వచ్చిన కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలెం వెంకటేష్, వీరభద్రచారి, సిందం శ్రీనివాస్, ముత్తు అశోక్, డొంగ్రి కార్తీక్, పిర్సింగుల తిరుపతి, సంతోష్ ఠాకూర్, నికోడె అర్జున్, రాజేందర్ జంజోడ్, తిరుపతి, శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి

నవతెలంగాణ-జైపూర్



విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్నందున థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్ మేరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గురువారం సంస్థ డైరెక్టర్లు, సింగరేణి వ్యాప్త జనరల్ మేనేజర్లతో బొగ్గు ఉత్పత్తిపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇంధన ఒప్పందం గల అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలు వేసవి ప్రవేశించిన నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచుతాయని తెలిపారు. ఫలితంగా రోజు రోజుకు బొగ్గు డిమాండ్ పెరగనున్నందున రోజు వారి ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఇక నుండి రోజుకు 2.3 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి తప్పనిరిగా సాధించాలని, అదే పరిమాణంలో బొగ్గు రవాణా చేయాలని ఆదేశించారు. ఉత్పత్తి పెరగాలంటే ఓవర్ బర్డెన్ తొలగింపు కూడా లక్ష్యాల మేరకు సాధించాల్సి ఉంటుందని తెలిపారు. రోజుకు కనీసం 17 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని సూచించారు. మార్చి నెల నుండి వరుసగా నాలుగు నెలల పాటు ఇదే ఒరవడి కొనసాగించాలని, తర్వాత వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 750 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనకు గట్టి పునాది ఏర్పడుతుందని తెలిపారు. అదేవిధంగా వివిధ ఏరియాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాస పనులు మరింత వేగవంతం చేయాలని, ఏరియాల వారి యాజమాన్యాల వారు సంబంధిత జిల్లా కలెక్టర్లతో, అటవీ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పనులు పూర్తి చేయాలని సూచించారు.

ఆయిల్‌ఫామ్ పంట సాగుపై రైతులకు అవగాహన

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని కోమటిగూడ గ్రామంలో గురువారం ఆయిల్‌ఫామ్ పంట సాగుపై రైతులకు వ్యవసాయాధికారి మిలింద్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్‌వెల్, బావి కలిగి ఉండి విద్యుత్ కలిగివున్న రైతులు ఈ పంట వేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులను ఈ సాగుకు ఎంపిక చేశామని, పూర్తి వివరాల కోసం వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పురుషోత్తం, వ్యవసాయ విస్తరణ అధికారులు అరవింద్, శంకర్, తాండవకృష్ణ, రైతులుపాల్గొన్నారు.

భోజన విరామ సమయంలో నిరసన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమకు వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగ, కార్మికులు గురువారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా నిరసన చేపడుతున్న విషయం తెల్సిందే. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ వేతన సవరణ గడువు ముగిసి 11 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వేతన సవరణ చేపట్టకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని అన్నారు. శుక్రవారం నుండి ట్రాన్స్‌కో సర్కిల్ కార్యాలయాల ముందు ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ ఎమ్మాజి సతీష్, నాయకులు వెంకటేష్, శ్రీనివాస్, రామకృష్ణ, ప్రతాప్, రమేష్, విశ్వనాథ్, సుధారాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు నడిపించాలి

నవతెలంగాణ-జైపూర్

మంచిర్యాల నుండి శివ్వారం మీదుగా చెన్నూర్‌కు ప్రయాణికుల సౌకర్యంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలని శివ్వారం గ్రామ సర్పంచ్ ఆవిడపు గణేష్ ఒక ప్రకటనలో కోరారు. గతంలో శివ్వారం మీదుగా చెన్నూర్-మంచిర్యాల మధ్య నాలుగు బస్సు సర్వీస్సులు నడిపించగా ఇప్పుడు ఒక్క బస్సు మాత్రమే వచ్చిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బస్సు ఆధారంగా పది నుండి ఇరువై గ్రామాల ప్రయాణికులు రాకపోకలు సాగించే అవకాశం ఉన్నందున ఆర్టీసీ యాజమాన్యం పునరాలోచన చేయాలని కోరారు. ప్రయాణికులకు కలుగుతున్న అసౌకర్యాన్ని డిపో మేనేజర్‌ను కలిసి వివరించినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా డిపో మేనేజర్ స్పందించి గతంలో మాదిరిగా బస్సు సర్వీసుల రాకపోకలు పునరుద్దరించాలని విజ్ఞప్తి చేశారు.

జీపీ భవనం చిన్న సిద్ధాపూర్‌లోనే నిర్మించాలి



బెజ్జూర్ : పెద్దసిద్ధాపూర్ గ్రామ పంచాయతీ భవనాన్ని చిన్నసిద్ధాపూర్‌లోనే నిర్మించాలని వార్డుసభ్యులు, గ్రామస్తులు కోరారు. గురువారం చిన్నసిద్ధాపూర్‌లో సర్పంచ్ పొరిశెట్టి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో మెజార్టీ వార్డు సభ్యులు, ప్రజలు పక్కా భవనాన్ని సిద్ధాపూర్‌లో నిర్మించాలని కోరారు. పెద్దసిద్ధాపూర్ పంచాయతీ అయినందున పెద్దసిద్ధాపూర్‌లోనే పంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు గతంలో ప్రతిపాదనలు పంపామని, అందుకు సంబంధించిన భూమిని సైతం చూపించడం జరిగిందని సర్పంచ్ రవి గ్రామసభలో ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన వార్డుసభ్యులు, చిన్నసిద్ధాపూర్ గ్రామస్తులు చిన్నసిద్ధాపూర్‌లోనే పంచాయతీ నిర్మాణం కోసం రెండున్నర గుంటల స్థలాన్ని అందించడానికి దాత సిద్ధంగా ఉన్నాడని తెలిపారు. చిన్నసిద్ధాపూర్‌లో గ్రామ పంచాయతీ భవనం నిర్మించకుంటే మెజార్టీ వార్డుసభ్యులు రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దీనికి సంబంధించిన పక్కా భవనం సిద్ధాపూర్‌లో నిర్మించాలని తీర్మానం చేశారు.

ఎఐఎంఐఎం జెండావిష్కరణ



కాగజ్‌నగర్ : ఎఐఎంఐఎం 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కాగజ్‌నగర్‌లోని ఎన్టీఆర్‌చౌక్‌లో ఆ పార్టీ పతాకాన్ని పట్టణ అధ్యక్షులు అబ్దుల్ ముబీన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం తమ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జావీద్ మల్లాస్, నాయకులు ఎండి నియాజ్, ఎంఎ అబిద్, సయ్యద్ సాదిక్, ఎండి అఫ్జల్, అజ్గర్, అహ్మద్ పాషా, అమర్ సయిూద్, ఎండి సద్దాం పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుండి కిష్టాపూర్ గ్రామానికి రూ.ఏడు లక్షలు, గోడిసెర గ్రామానికి రూ.ఏడు లక్షలు మంజూరైన సీసీ రోడ్డు పనులకు గురువారం జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్ మండల నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లలిత బోజన్న, పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్ రావు, సర్పంచ్‌లు శైలజ నరేందర్ రెడ్డి, భోజవ్వ గంగాధర్, ఎంపీటీసీ దత్తు, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్, పీఏసీఎస్ డైరెక్టర్ సుధీర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

నవతెలంగాణ-ఖానాపూర్

అర్హులకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. గురువారం ఖానాపూర్ పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లక్కీడ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా 400 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కోసం డ్రా పద్ధతిలో చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 700 అర్జీదారులకు దరఖాస్తు చేసుకోగా, లక్కీడ్రా ద్వారా 400 డబుల్ బెడ్ రూమ్‌లను కేటాయించామని తెలియజేశారు. మిగతా వారికి స్థలం కేటాయించి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. ఈ విషయంపై ప్రతిపక్షాల నాయకుల అనవసరంగా పంపిణీ జరగకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. వారి మాటలు నమ్మొదని అర్హులందరికీ న్యాయం చేస్తామని అన్నారు.

ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను పూర్తిగా రద్దు చేయాలి

- ఐసీడీఎస్ ప్రయివేటీకరణను ఆపాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



నవతెలంగాణ-నిర్మల్

ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను పూర్తిగా రద్దు చేయాలని, ఐసీడీఎస్ ప్రయివేటీకరణను ఆపి, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. గురువారం తెలంగాణ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారని అన్నారు. విరంతా మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు ఎక్కువ మంది ఉన్నారని అన్నారు. గత 40 సంవత్సరాలుగా పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని అన్నారు. వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, చట్టబద్ధ సౌకర్యాలు ప్రభుత్వం నేటికీ కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అంగన్‌వాడీ ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని తెలిపారు. మన పక్కన ఉన్న తమిళనాడు, పాండిచ్చేరి, రాష్ట్రాల్లో అక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చారని అన్నారు. పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు అంగన్‌వాడీ ఉద్యోగులకు కల్పించడం లేదని విచారణ వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వర్కర్ పేరు టీచర్స్‌గా మార్చారని, కానీ టీచర్‌తో సమానంగా వేతనాలు, ఇతర సౌకర్యాలు మాత్రం ఇవ్వడం లేదని అన్నారు. అసెంబ్లీ సమావేశంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీని చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు, టీఏ, డీఏలు వెంటనే చెల్లించాలని అన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.50 లక్షలు చెల్లించాలని, అంగన్‌వాడీ ఉద్యోగులపై అధికారుల, ప్రజాప్రతినిధుల వేధింపులు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బానోత్ సుజాత, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి, కార్యదర్శి లలిత, ఉపాధ్యక్షురాలు రజియా, స్వర్ణలత, శశికల, శైలజా, భాగ్యలక్ష్మి, గంగమణి, డాకూర్ రాజమణి, దుర్గం వందన, ప్రమీల, మంజుల, రాజేశ్వరి, లావణ్య, రమ్య, దేవిక, కమల, వనజ, భాగ్య పాల్గొన్నారు.



ఆదిలాబాద్ అర్బన్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో మార్చి 1, 2, 3లలో రాష్ట్రవ్యాప్త నిరసనకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. అందులో భాగంగా అంగన్‌వాడీ ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరం ఏర్పాటు చేసి సమ్మెను కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత వంటి చట్టబద్ధ సౌకర్యాలు ఏవి ప్రభుత్వం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-భైంసా

ముధోల్ మండలంలోని బ్రహ్మణగావ్ గ్రామంలో రూ.20లక్షల నిధులతో గ్రామపంచాయతీ కార్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారిగా పరిష్కారం చేస్తానాని తెలిపారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ సునీత పోశెట్టి, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మంత్రివార్ గంగాధర్, నాయకులు కిష్టయ్య, గౌతమ్, వార్డు సభ్యులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన చెక్కులను మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఎనిమిది మంది లబ్దిదారులకు రూ.లక్ష 99 వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని అన్నారు. ఇటీవల గ్యాస్ ధరలను కేంద్రం భారీగా పెంచిందని అన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే జోగు రామన్న నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టబోతున్నామని వివరించారు. దేశ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆవుల వెంకన్న, వెనగంటి ప్రకాష్, నాయకులు మిషు, మల్లయ్య పాల్గొన్నారు.

అనర్హులను డబుల్ బెడ్ రూం జాబితా నుండి తొలగించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

అనర్హులను డబుల్ బెడ్ రూం జాబితా నుంచి వెంటనే తొలగించాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. గురువారం ఖానాపూర్ పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లక్కీడ్రా ఉండగా దీన్ని కాంగ్రెస్, బీజేపీ నాయకులు వ్యతిరేకించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల జాబితాలో స్థలాలు, ఇండ్లు ఉన్నవారికి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే సైతం ఇష్టారాజ్యంగా చేశారని, తిరిగి రీ సర్వే నిర్వహించాలని, ఆందోళన చేపట్టారు. అనర్హులను జాబితా నుండి వెంటనే తొలగించి, అర్హులకు మాత్రమే డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని అన్నారు. అంతేకాకుండా మిగిలిన అర్హులకు ఖాళీ స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూం విషయంలో అర్హులకు అన్యాయం జరిగితే సహించేది లేదని అన్నారు. ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు, బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి, మామడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ కౌన్సిలర్లు కిషోర్ నాయక్, రాజుర సత్యం, కాంగ్రెస్ నాయకులు దొనికేని దయానంద్, అమానుల్లా ఖాన్, రమేష్, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్ ఉన్నారు.

జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా గ్రంథాలయాన్ని గురువారం కలెక్టర్ వరుణ్ రెడ్డి సందర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను కలిసి వారికి ప్రస్తుత గ్రంథాలయంలో ఏ వసతులు ఉన్నాయని, ఇంకా ఏ వసతులు సమకూర్చాలని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను చూసి తాను చదువుకునే రోజులు గుర్తు వస్తున్నాయని వెల్లడించారు. అభ్యర్థులకు గ్రూప్స్ సంబంధించిన మాక్ టెస్టుల నిర్వహణ, ఎకనామిక్స్, తెలంగాణ చరిత్ర గురించి తరగతులు నిర్వహించే విధంగా చూడాలని కోరారు. గ్రంథాలయ పని వేళలను పెంచాలని కోరారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే వారికి కావాల్సిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. యువతీ, యువకులు గ్రంథాలయంలో ఉండే పత్రికలు, పుస్తకాలు క్రమం తప్పకుండా చదువుకోవాలని అన్నారు. భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అదనపు గ్రంథాలయ హాల్ నిర్మాణం పనులు వారంలోగా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్షులు ఎర్రవోతు రాజేందర్, కార్యదర్శి పి.లక్ష్మీ రాజ్యం, సిబ్బంది పి.విజయ, ఆర్.మోహన్ సింగ్, పృథ్వీరాజ్, జ్ఞానేశ్వర్‌లు ఉన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా, కేంద్రం దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-నిర్మల్

కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్ రెడ్డి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి వివేకానంద చౌరస్తా వరకు మహిళలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం చేసి, పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ, బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్‌లకు కొమ్ముకాస్తూ, సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందని అన్నారు. కార్పొరేట్ కంపెనీలపై ఉన్న ప్రేమ సామాన్య ప్రజలపై లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ రోజు ఏదో ఒక రూపంలో ధరలు పెంచుతూ పేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటుందని అన్నారు. సిలిండర్ ధరలను అమాంతంగా పెంచి సామాన్య మహిళలకు గ్యాస్ సిలిండర్‌ను కేంద్ర ప్రభుత్వం దూరం చేస్తుందన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించకపోతే బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక రమణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మారుకొండ రాము, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

తాంసి: పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ తాంసి మండల కేంద్రంలో, భీంపూర్ మండలకేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాధాలు చేశారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ కన్వీనర్‌లు అరుణ్ కుమార్, నాగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంట గ్యాస్ సిలిండర్ల ధరలు, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో మధ్య తరగతి కుటుంబాలు బతకడం భారంగా ఉందని అన్నారు. దేశ సంపద పూర్తిగా బడా పెట్టుబడిదారుల జేబుల్లోకి పోతున్నాయని అన్నారు. మళ్లీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, రాష్ట్రాలను, దేశాన్ని అమ్మెస్తారని అన్నారు. వెంటనే వంట గ్యాస్ ధరలను తగ్గించాలి లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు రాజు, సుధాకర్, నాయకులు లింబాజీ, సదానందం, వెంకన్న, రమణ, గోవర్ధన్‌రెడ్డి, నర్సింగ్ ఉన్నారు.

లోకేశ్వరం: కేంద్రప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, గ్యాస్ వినియోగదారులు పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యాంసుందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భైంసా: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ



గురువారం నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లోని నయాబాది చౌరస్తా లో, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాస్తా రోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని అన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరు సార్లు ధరలు పెంచిందని అన్నారు. దీంతో సామాన్యులకు అధిక భారం పడుతుందని పేర్కొన్నారు. దేశంలో ప్రజలు అన్ని విషయాలు గ్రహిస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో బిజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అఫ్రోజ్ ఖాన్, మగ్దుమ్, రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, సుధాకర్, సంజీవ్, పోతన్న యాదవ్, పోశెట్టి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-బేల

అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్లను మైనింగ్ శాఖ ఏడీ రవిశంకర్ పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గురువారం బేల మండలంలోని కొగ్దూర్ గ్రామ సమీపంలోని పెన్‌గంగాలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్‌లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా మైనింగ్ ఏడీ రవిశంకర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కడ కూడా ఇసుక రవాణకు అనుమతులు లేవని, బేల మండలంలోని కొగ్దూర్ గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌లను మైనింగ్, పోలీసుల ఆధ్వర్యంలో పట్టుకొని సీజ్ చేసి, పెనాల్టీ వేయడం జరుగుతుందని అన్నారు. ఇక మీదట ఎక్కడ అక్రమ ఇసుక రవాణా జరిగిన చర్యలు తప్పవని అన్నారు. ఆయన వెంట బేల ఎస్సై కృష్ణ కుమార్, ఆర్ఐ ఆనంద్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ కలెక్టర్‌లకు సౌకర్యాల ఏర్పాటు



నవతెలంగాణ-కడెం

మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్‌లో ఈనెల 4వ తేది నుంచి 5 రోజుల పాలు శిక్షణ కలెక్టర్‌లు పర్యటించనున్నారని ఏపీడీ ఓస ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కలెక్టర్ల పర్యటన నేపథ్యంలో వారికి నచ్చన్‌ఎల్లాపూర్‌లో ఉండేందుకు సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు సర్పంచ్ బొడ్డు గంగన్నకు పలు సూచనలు చేయడం జరిగిందని అన్నారు. సౌకర్యాలను పరిశీలించిన వారిలో ఎంపీడీఓ లింబాద్రి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శి మనోజ్, సత్యం, ఎఫ్ఏ కమలాకర్, కారోబారి మహేందర్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ కలప తరలిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-కడెం

అక్రమంగా కలప తరలించిన, అటవీ నేరాలకు పాల్పడిన చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని కడెం ఎఫ్ఆర్ఓ అనిత అన్నారు. గురువారం మధ్యాహ్నాం ఇటీవల కడెం అటవీ రేంజ్ పరిధిలో రెండు కార్లలో అక్రమంగా కలప తరలించిన ప్రధాన నిందితుడు కల్లేడ గ్రామానికి చెందిన మేడిశెట్టి మహేష్‌ను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసి, కడెం తహసీల్దార్ చిన్నయ్య వద్ద బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ అనిత మాట్లాడుతూ అడవులలో చెట్లను నరికిన అక్రమంగా కలప తరలించిన, అటవీ నేరాలకు పాల్పడిన, ఉపేక్షించేదిలేదని నిందితులు ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓలు సిద్ధార్థ, ప్రకాష్, బీట్ ఆఫీసర్ ఏంఎ అలీం, కల్లేడ సర్పంచ్ ఎంబడి లావణ్య తిరుపతి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ మనువాద దాడికి వ్యతిరేకంగా పోరాడుదాం



నవతెలంగాణ-నిర్మల్

మహిళలపై కేంద్ర ప్రభుత్వ పాసిస్ట్ మనువాద దాడికి వ్యతిరేకంగా పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మీ అన్నారు. గురువారం నిర్మల్ రూరల్ మండలం నీల్వాయిపేట్ గ్రామంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.మార్చి 8 అంతర్జాతీయ మహిళా ఆవిర్భవం జరిగి సరిగ్గా 112 సంవత్సరాలు అయిందన్నారు. నేటికీ మహిళల బ్రతుకుల్లో ఎలాంటి మార్పు లేవని, మహిళలపై నేటికీ అత్యాచారాలు, వేధింపులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. వీటిని అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. నాటి నుండి నేటి వరకు ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక మహిళా సంఘాలు సంస్థలు ఉద్యోగులు మార్చి 8ని హక్కుల దినంగా నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. మహిళా ఆర్థిక, రాజకీయ, సాంఘిక సాంస్కృతిక సమస్యలను చర్చించుకునేందుకు సంఘటితమయ్యేందుకు స్ఫూర్తిదాయకంగా దీనిని జరుపుతున్నారని అన్నారు. జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలపై దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాలలో దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగాయని అన్నారు. 2021 సంవత్సరం కంటే 2022లో మహిళలపై దాడులు 30 శాతం పెరిగాయని అన్నారు. దేశవ్యాప్తంగా 30 వేల ఎనిమిది వందల అరవై నాలుగు ఫిర్యాదులలో వాటిలో ఒక్క యూపీ రాష్ట్రం నుండే 158 ఫిర్యాదులు అందాయని అన్నారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం ఆసరా, అభయస్తం, డ్వాక్రా గ్రూపులకు వడ్డీ లేని రుణాలు, కళ్యాణలక్ష్మి ఇలా అనేక పథకాలు సరిగ్గా అమలుకు నోచుకోవడం లేదన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో దాని చుట్టుపక్కల మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. మహిళలపై, బాలికలపై, సామూహిక అత్యాచారాలు తీవ్రస్థాయిలో పెరుగుతున్నాయని, గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని అన్నారు. మార్చి 1 నుండి 8 వరకు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళల హక్కుల రక్షణకై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ కార్యదర్శి కే. రాజన్న, శ్రావణ్, లావణ్య, అమృత, కవిత, సరస్వతి పాల్గొన్నారు.

భార్యాభర్తలు కలిసి దోచుకుంటున్నారు...!

- శ్యాంనాయక్‌ను సస్పెండ్ చేయాలి
- ఖానాపూర్‌లో బీజేపీ ధర్నా



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఆమె భర్త శ్యాంనాయక్ కలిసి ప్రజలను దోచుకుంటున్నారని బీజేపీ నాయకులు జెడ్పీటీసీ జానూబాయి, నియోజక వర్గ నాయకుడు హరినాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలో రోడ్డుపై బైటాయించి ధర్నా చేశారు. దీంతో నిర్మల్ వెళ్లే రహదారిపై గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా బీజేపీ నాయకురాలు పెంబి జడ్పీటీసీ జానూబాయి, నియోజకవర్గ నాయకుడు హరినాయక్ మాట్లాడారు. ప్రజల శ్రేయస్సుకోసం పనిచేయాల్సిన ఎమ్మెల్యే రేఖానాయక్, ఆమె భర్త శ్యాంనాయక్ అవినీతికి పాల్పడుతూ అక్రమ సంపాదనకు ఎగబడ్డారని ఆరోపించారు. రవాణా శాఖలో పనిచేసే శ్యాంనాయక్ విధులకు ఎగనామంపెట్టి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా ఆ శాఖలో పనిచేస్తున్న సిబ్బందితో డబ్బులు వసూలు చేయిస్తున్నారని ఫిర్యాదు చేసినా కూడా సీఎం మౌనం పాటించడం సరైంది కాదని అన్నారు. విచ్చల విడిగా అక్రమాలు చేస్తున్న శ్యాంనాయక్‌పై ప్రభుత్వం ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. శ్యాంనాయక్ చేస్తున్న అక్రమ వసూళ్లలో సీఎంకి వాటాలు పోతున్నాయని ఆరోపించారు. ఎంపీగా పోటీచేయడానికి ప్రజలను దోచుకుంటారా అని ప్రశ్నించారు. ప్రతి పనిలో వాటాలు, కమీషన్లు ఇస్తేనే పనిచేసే ఎమ్మెల్యే రేఖానాయక్, ఆమె భర్త శ్యాంనాయక్ కలిసి ఖానాపూర్ నియోజకవర్గాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని వారికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల శ్రీనివాస్, బుచ్చన్న యాదవ్, టేకు ప్రకాష్, అమంద రాజ్ కుమార్, అవుసుల ఆనంద్, గంగామణి పాల్గొన్నారు.

అర్హులమైన ఇండ్లు రాలేదని మహిళల ధర్నా, రాస్తారోకో



నవతెలంగాణ-ఖానాపూర్

20 ఏండ్లుగా అద్దె ఇండ్లల్లో బతుకుతున్న తాము అన్ని విధాల అర్హులమైన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రాలేదంటూ గురువారం మహిళలు తెలంగాణ తల్లి చౌరస్తాలో ధర్నా రాస్తారోకో చేశారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు రోడ్డుపై బైఠాయించారు. డబుల్ బెడ్ రూమ్‌లను డబ్బులకు అమ్ముకున్నారని, లక్కీడ్రా వల్ల తమకు ఎంతో నష్టం జరిగిందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తే అర్హులైన అందరికీ ఇవ్వాలని లేకుంటే మంజూరైన వాటిని కూడా రద్దుచేసి తిరిగి మళ్లీ సర్వే నిర్వహించి ఎంపిక చేయాలని అన్నారు. భూములు ఇండ్లు వాహనాలు ఉన్నవారికి సైతం డబుల్ బెడ్ రూమ్‌లు వచ్చాయని, సెంటు భూమి కూడా లేని తమకు ఇండ్లు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా సర్వే చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అర్హులమైన వారిని తిరిగి ఎంపిక చేసి న్యాయం చేయాలని అన్నారు. ఆందోళన బాట పట్టిన మహిళలను పోలీసులు సముదాయించిన శాంతించలేదు. అనంతరం నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి మహిళలకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఆందోళనలో మహిళల వెంట ఏఐపీకేఎస్ రాష్ట్ర నాయకులు నందిరామయ్య ఉన్నారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భైంసా

ముధోల్ మండలంలోని చించాల గ్రామంలో పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొడ్డికింది సర్వేష్, ఉపాధ్యక్షుడిగా గట్టుపెల్లి కమలాకర్, జాయింట్ క్యాషియర్‌గా గోనె సాయినాథ్, గట్టుపెల్లి రమేష్, సభ్యులుగా గంగాధర్, పోశెట్టి, శంకర్, రవి, భూలోకం, లక్ష్మణ్, అంజయ్య, విఠల్, గట్టుపెల్లి నర్సయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గట్టుపెల్లి రంజీత్ (బిట్టు), గోనె సాయినాథ్, జి.బీమేందర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

నవతెలంగాణ-నస్పూర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరాంపూర్ ఏరియాలోని మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ అరవింద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 4వ తేదీన ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో సాయంత్రం 5 గంటలకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మార్చి ఆరవ తేదీన శ్రీరాంపూర్ ఏరియా లోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో, వివిధ గనల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులందరికీ సెంట్రల్ నర్సరిలో మధ్యాహ్నం 4 గంటలకు ఆటల పోటీలు, నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయ్‌లో సాయంత్రం 5 గంటలకు మహిళలకు వివిధ క్రీడాంశాలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలందరూ అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు. పోటీలలో గెలుపొందిన వారికి ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతులను అందజేయనున్నారు.

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

నవతెలంగాణ-మంచిర్యాల టౌన్

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం రాజేష్ అన్నారు. పాత మంచిర్యాల క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న బులి శెట్టి హనుమంతు పటేల్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ రెండవ లీగ్ మ్యాచ్‌లకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడాకారుల పరిచయ అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆటలు సాగాలని కోరారు. జిల్లా కేంద్రంలో స్టేడియం ఏర్పాటుకు స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. ఓఎంసీ క్రీడ జట్టుకు దుర్గం పోశం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా టి షర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఓల్డ్ మంచిర్యాల స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు బొలిశెట్టి కిషన్, సెక్రటరీ ఎర్రం ప్రభాకర్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు అంబ్రోస్, రమేష్ యాదవ్, వైభవ్ కుమార్, మహేష్, లవన్, బొలిశెట్టి ప్రశాంత్, బోయిని శేఖర్, దుర్గం శ్రీకర్, బొలిశెట్టి లక్ష్మణ్ , సుబ్బు, సిద్దు, నవీన్ రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా బంద్ పాక్షికం

- ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

నవతెలంగాణ-మంచిర్యాల టౌన్

గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా కడెం ప్రాజెక్ట్ ఆయకట్టు పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ గురువారం ఇచ్చిన జిల్లా బంద్‌కు వ్యాపారుల నుండి మిశ్రమ స్పందన లభించింది. ప్రధాన మార్కెట్ ఏరియాలో కొన్ని దుకాణాలు మూసివేశారు. దండేపల్లిలో అమరణ నిరాహారదీక్ష చేస్తున్న రైతులకు, కాంగ్రెస్ నాయకులకు మద్దతుగా వర్తక వాణిజ్య సంస్థలు బంద్ పాటించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరల సురేఖ అధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దుకాణాలు మూసి వేయించాలని ప్రయత్నం చేసినా కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేశారు. కూరగాయల మార్కెట్ రోడ్ వైపు వెళ్తున్న నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి కార్లు, ఆటోల్లో పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాయకులు, కార్యకర్తల అరెస్టును డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఖండించారు. శాంతియుతంగా ర్యాలీ తీస్తున్న వారిని అరెస్టు చేయడం సమంజసం కాదని అన్నారు. మధ్యాహ్నం వరకు బంద్ ప్రభావం లేకపోవడంతో అభివృద్ధి తీసుకున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు వదిలిపెట్టారు. నిరసన కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు చిట్ల సత్యనారాయణ, కొండ చంద్రశేఖర్, తూముల నరేష్, పూదరి తిరుపతి, ప్రభాకర్, మజీద్, రాజమౌళి, చింతకింది మల్లయ్య ఉన్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం లాంటిది

నవతెలంగాణ-జన్నారం

ప్రతి పౌరునికి సమాచార హక్కు చట్టం వజ్రాయుధం లాంటిదని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ సెక్రటరీ ఐలవేణి నరసయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పనితీరులో పారదర్శక జవాబు దారితనం తీసుకురావడం కోసమే దేశంలో రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం 2005 అమల్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నిరుపేదలకు క్షేత్రస్థాయిలో అందడం లేదుని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టాలపై ప్రభుత్వ అధికారులు ప్రతి గ్రామ గ్రామాన ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికలకు కార్మిక సంఘాలకు పిలుపు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో గుర్తింపు ఎన్నికలకు డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏఐటీయూసీ పోరాటఫలితంగా ఎలక్షన్లు నిర్వహించడానికి అంగీకరించినట్లు తెలిపారు. కార్మికుల ప్రధాన సమస్యలు పెండింగ్‌లో ఉండటాన్ని దృష్టిలో పెట్టుకొని హైకోర్టును ఆశ్రయించడంతో మూడు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అప్పటికి సింగరేణి యాజమాన్యం, రీజనల్ లేబర్ కమిషన్ స్పందించకపోవడంతో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆర్‌ఎల్‌సీ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించినట్టు తెలిపారు. తద్వారా సెంట్రల్ లేబర్ కమిషన్ వెంటనే డిప్యూటీ ఛీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసును ఎన్నికలు నిర్వహించుటకు రిటర్నింగ్ అధికారిగా నియమించారని తెలిపారు. 13వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని సంఘాలకు పిలుపు వచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికలు జరపకుండా ఎవరైనా ప్రయత్నిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని అన్నారు.

ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా పాఠశాలకు టీవీ అందజేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసిఫాబాద్ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు బీఆర్ యువజన సంఘం నాయకుడు ఆవిడపు ప్రణయ్ స్మార్ట్ టీవీ, విద్యార్థులకు నోట్స్ అందజేశారు. జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల విద్యాధికారి మనుకుమార్, జిల్లా సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, సత్తయ్య జంబోజు, పాఠశాల ప్రత్యేక అధికారి ముంజం ధర్మయ్య ఉపాధ్యాయులు సోనాజీ, శ్రీమతి స్వరూప పాల్గొన్నారు. అదేవిదంగా బాబాపూర్‌లో నిర్వహించిన వేడుకల్లో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు, పెన్సిల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్రం అంకిత్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, రాపర్తి కార్తీక్, టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్, గోపాల్ నాయక్, సర్పంచ్ వరలక్ష్మి, రిపోర్టర్ రాందాస్, మైనారిటీ నాయకులు నిసార్, తాజ్, ఇమ్రాన్, అహ్మద్ పాల్గొన్నారు. తేలి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో పాఠశాలలో విద్యార్థులకు అరటి పండ్లు నోట్ బుక్కులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు హిడ్రే సందీప్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వైరగాడే మారుతి పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెంగ్రే ఆకాష్, మండల అధ్యక్షులు సెండే మురళీ కృష్ణ పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థల దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-తాండూర్



కార్పోరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చూస్తూ గురువారం ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో కార్పొరేట్ విద్యా సంస్థల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బెల్లంపల్లి కొత్త బస్టాండ్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చైతన్య నారాయణ కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతూ పిట్టల్లా రాలిపోతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పసులేటి వెంకటేష్, ఆకాష్, ప్రదీప్, రవి, శేఖర్, నరేష్, రాజు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దు చేయాలి

- ఐసీడీఎస్ ప్రయివేటీకరణను ఆపాలి
- అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-మంచిర్యాల టౌన్

నూతన విద్యా విధానం రద్దుతోపాటు ఐసీడీఎస్ ప్రైవేటీకరణ ఆపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సమ్మె చేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారనీ, మహిళలు బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. గత 40 సంవత్సరాలుగా పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారనీ, వీరికి కనీస వేతనం,పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, చట్టబద్ధత కల్పించలేదని అన్నారు. దీనివల్ల అంగన్‌వాడీ ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని, మన పక్కన ఉన్న తమిళనాడు, పాండిచ్చే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చారని, పశ్చిమ బెంగాల్, కేరళ తదితరాష్ట్రలో రిటర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. మన రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. వర్కర్ పేరు టీచర్స్‌గా మార్చారని, టీచర్‌కు సమానంగా వేతనాలు ఇతర సౌకర్యాలు మాత్రం ఇవ్వడం లేదని అన్నారు. అసెంబ్లీ సమావేశంలో సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజమణి, శంకరమ్మ, అనురాధ, రాజేశ్వరి, మహేశ్వరీ, సువర్ణ, భాగ్యలక్ష్మి, సత్యవతి, శారదా, రాదబాయ్, విజయలక్ష్మి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అశోక్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఖాళీ అయిన ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. రేషన్ బియ్యం సెంటర్ల వరకు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు వనిత రాజేశ్వరి, చంద్రకళ, సువర్ణ, సరోజ, ధనలక్ష్మి, లక్ష్మి, అంజలి, ఇందిరా, సునీత పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని రాస్తారోకో



భీమారంలో..

నవతెలంగాణ-భీమారం

మోడీ ప్రభుత్వం పేదోడి నడ్డి విరుస్తూ నిత్యవసర ధరలను అమాంతం పెంచుకుంటు వస్తోందని మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు వెల్లివెత్తాయి. గురువారం మండల కేంద్రంలోని మంచిర్యాల చెన్నూర్ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తాజాగా పెంచిన గ్యాస్ ధరలతో రూ.1200 సిలెండర్ ధర చేరుకుందని, ఇప్పటికే పెంచిన ధరలతో పేదోడు అల్లాడి పోతుంటే ధరలను దించాల్సింది పోయి డొమస్టిక్ సిలిండర్‌పై రూ. 50, కమర్షియల్ సిలిండర్‌పై రూ. 350 పెంచడం అమానుషం అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిరుమల, నాయకులు పోడేటి రవి, మాజీ జెడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్ నాయక్, రైతు కోఆర్డానేటర్ మహేశ్వర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, మహిళలు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలకు వ్యతిరేకంగా మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలు జీవించలేని విదంగా ధరలు పెంచుతోందని, పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షులు జె.రవీందర్, అబ్దుల్ అజీజ్, మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, పట్టణ ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మయ్య పాల్గొన్నారు.

కోటపల్లి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మండల కేంద్రంలోని రోడ్డుపై గురువారం ఆ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆలుగామ తపాలా శాఖ ఉద్యోగి గోమాస ప్రవీణ్ పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ, పీఏసీఎస్ చెర్మెన్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్‌లో..

చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించాలి

- ఆర్‌జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి
- మూడో రోజు నిరవధిక దీక్ష భగ్నం



నవతెలంగాణ-దండేపల్లి

కడెం ప్రధాన కాలువ, గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల రైతులకు సాగునీరు అందించాలని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి డిమాండ్ చేశారు. ఒకవైపు రైతుల ప్రభుత్వం అని చెప్పుకుంటూనే రైతులను నట్టేట ముంచుతోందని ఆరోపించారు. గూడెం ఎత్తిపోతల పథకం ప్రారంభం అయినప్పటి నుండి లెక్కలేనన్ని సార్లు పైపులు పగిలి రైతులు ఇబ్బందులకు గురవుతున్న ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. సాగునీటి కొరకు ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్న కాంగ్రెస్ నాయకులకు ఆరోగ్యం క్షీణిస్తోందని ఆయన తెలిపారు. అధికారులు స్థానిక వైద్యాధికారిచే వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారు వైద్యానికి నిరాకరించారని చెప్పారు. దీక్ష విరమించాలని కోరగా వారు నిరాకరించారు. తమకు లిఖితపూర్వకమైన హామీ ఇస్తేనే దీక్ష విరమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో లక్షెట్టిపేట్, దండేపల్లి, హాజీపూర్ మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్ష భగ్నం

కాంగ్రెస్ నాయకులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భగ్నం చేశారు. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతులను, కాంగ్రెస్ నాయకులను పోలీసులు బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించుకు వెళ్లారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపడుతున్న వారిని అరెస్టులు చేయటం అప్రజాస్వామికమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గూడెం ఎత్తిపోతల పథకానికి శాశ్వత పరిష్కారం చూపే వరకు ఉద్యమం కొనసాగుతుందని అన్నారు.



బంద్ ప్రశాంతం

ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా బందుకు పిలుపునివ్వగా గురువారం మండలంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించి రైతులకు మద్దతు తెలిపారు. కాగా బలవంతంగా బందుకు పాటిస్తే తమకు తెలపాలని పోలీసులు వ్యాపారస్తులకు సూచించారు. బలవంతంగా బందు పాటింపజేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులను హెచ్చరించారు.

భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై పోరుబాట

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో పోరుబాటకు సిద్ధమవుతున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల 4 నెలల పెండింగ్ జీతాలు వెంటనే అందించాలన్నారు. దీనితోపాటు కార్మికుల సమస్యలైన ఈఎస్ఐ, పిఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 13 న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాతోపాటు సమ్మె చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం ఈ నెల 3 నుంచి కార్మికులను చైతన్యం చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో కార్మికుల సమస్యలపై చర్చ, మండల కమిటీల నిర్మాణంతో పాటు మండల కేంద్రాల్లో తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో అధికారులు స్పందించరకపోతే ద్యమం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ కార్యాలయంలో నిర్వహణ కంపెనీ ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, జిల్లా కోశాధికారి సిహెచ్ బాల్లేష్, జిల్లా ప్రచార కార్యదర్శి చందు, జిల్లా కార్యదర్శి జే.సంతోష్ పాల్గొన్నారు.

మున్సిపల్ వార్షి బడ్జెట్ రూ.22.82 కోట్లు



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీలో 2023-24 వార్షిక బడ్జెట్ ప్రణాళిక రూ.22.82 కోట్లకు పాలకవర్గం గురువారం ఆమోదం తెలిపినట్టు కలెక్టర్ బధావత్ సంతోష్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో పాలకవర్గం ఆమోదం తెలిపింది. కలెక్టర్ సంతోష్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి సమావేశానికి హాజరయ్యారు. మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధికి కషి చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కౌన్సిలర్‌ల నిరసన

మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశం కేవలం అంకెలకే పరిమితం అయ్యాయని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, 20 వార్డ్ కౌన్సిలర్ సురిమిల్ల వేణు ఆరోపించారు. బడ్జెట్ సమావేశం అనంతరం కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్లకార్డులతో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వార్డులలో మిషన్ భగీరథ పనులు పూర్తి కాలేదని, రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని మిషన్ భగీరథ పనులు పూర్తిచేయాలని కోరారు. గతంలో నస్పూర్ మున్సిపాలిటీకి ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.4 కోట్లు మంజూరయ్యాయని వాటిని సరైన అభివృద్ధికి వినియోగించక దాదాపు రూ.2.5 కోట్లు వెనక్కి వెళ్లాయని అన్నారు. ఈ బడ్జెట్ సమావేశంలో నస్పూర్ మున్సిపాలిటీకి ఎంపీ, ఎమ్మెల్యే నిధులలో ఒక రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు.

తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి డబుల్‌బెడ్ రూమ్ ఇవ్వాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో నిర్వహించిన డబల్ బెడ్ రూమ్‌ల సర్వే అధికారులు పారదర్శకంగా చేయకుండా అర్హులైన నిరుపేదలను అనర్హులుగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. అధికారులు రిజెక్ట్ చేసిన వారిని ఎందుకూ రిజెక్ట్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికి మాత్రమే అర్హులుగా ప్రకటించి నిజమైన అర్హులను అనర్హులుగా గుర్తించారని అన్నారు. కేవలం తూ తు మంత్రంగా సర్వే చేయడం జరిగిందని ఇప్పటికైనా అధికారులు తిరిగి రిసర్వే నిర్వహించి తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరిని అర్హులుగా ప్రకటించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని, అదేవిధంగా రిసర్వే గడువు 15 రోజులకు పొడగించి ఈ సమాచారాన్నీ మున్సిపల్ అధికారులు ప్రచారాన్ని చేసి ప్రజలకు తెలియపరచాలని డిమాండ్ చేశారు. లేని యెడల సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6న దరకాస్తు దారులతో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరుగుతుందని అర్హులైన దరకాస్తుదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వనం సత్యనారాయణ, నక్క వెంకటస్వామి, కాదండీ సాంబయ్య, మిట్ట పెల్లి పౌలు, సీపీఐ నాయకులు దుర్గం దేవదాస్, ఎగుడ మొండి, కట్ల రమేశ్, గోడిసెల గురువయ్యా శఠగోపం కిష్టయ్య, బోయపోతుల కొమురయ్య, కారుకురి రయాలింగు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురద జల్లేందుకే దీక్ష నాటకం



నవతెలంగాణ-దండేపల్లి

బీఆర్ఎస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే దివాకర్ రావుపై బురదజల్లేందుకే కాంగ్రెస్ నాయకులు దీక్ష నాటకం ఆడుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్ విమర్శించారు. గురువారం మండల కేంద్రంలోని 32 డిస్ట్రిబ్యూటరీ వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడెం ప్రాజెక్టులో నీటి నిల్వ నిబంధన సధర్మట్ కెనాల్ నుంచి నీటిని నింపే ప్రయత్నం చేస్తున్నారని దండేపల్లి మండలానికి చేరువలో నీరు వచ్చిందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రైతులను కాంగ్రెస్ నాయకులు సాగునీరు అందదని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గూడెం ఎత్తిపోతల పథకం మంచిర్యాల ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు కృషి ఫలితమేనని ఆయన అన్నారు. సాంకేతిక లోపాలతో చెడిపోతే దానికి కూడా ఎమ్మెల్యే బాధ్యులవుతారని ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ గురువయ్య, డీసీఎంఎస్ చైర్మన్ లింగన్న, సహకార సంఘం చైర్మన్లు కాసనగొట్టు లింగన్న, బెడద సురేష్, వైస్ చైర్మన్ అక్కల రవీందర్, నాయకులు బండారి మల్లేష్, ఆకుల రాజేందర్, గొట్ల భూమన్న పాల్గొన్నారు.

నిరుపేదలను ఆపదలో ఆదుకుంటాం

నవతెలంగాణ-జన్నారం

నిరుపేదలను ఆపదలో ఆదుకుంటామని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు తిమ్మాపూర్ సర్పంచ్ జాడి గంగాధర్ అన్నారు. గురువారం సాయంత్రం తిమ్మాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఆసునూరి శంకరయ్య, కలమడుగు గౌరమ్మ కుటుంబాలకు రూ.2000 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జాడి వెంకట్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిందం చంద్రయ్య, క్రేజీ యూత్ అధ్యక్షుడు రేగుంట ప్రదీప్, నాయకులు సుద్దాల వెంకటేష్ కలమడుగు జీవన్ పాల్గొన్నారు.

కంటి వెలుగులో పరీక్షలు చేయించుకోవాలి

నవతెలంగాణ - జైనూర్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని గౌరీ, మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమంలో పేద ప్రజలకు ఎంతో లాభముంటుందన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడంలో ఎలాంటి నిర్లక్ష్యం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలో కావాల్సిన మౌళిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలను రోజూవారీగా నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి జితేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రమేష్, సిబ్బంది ఉన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
1 ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 03 మార్చి 2023

కౌటాల సీఐగా సాదిక్‌పాషా

నవతెలంగాణ - కౌటాల



కౌటాల సీఐగా ఎండీ సాదిక్‌పాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన బుద్ధ స్వామి ఇటీవల బదిలీల్లో కాగజ్‌నగర్ టౌన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సాదిక్‌పాషా బాధ్యతలు చేపట్టారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలకు ఆటంకం కలిగించకుండా అందరు సహకరించాలని కోరారు. తమ పరిధిలోకి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

యథేచ్ఛగా నల్లబెల్లం, పటిక దందా

- మ్యాదరిపేట కేంద్రంగా పెద్ద ఎత్తున వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కడ చూసినా నాటు సారా గుప్పుమంటోంది. నాటు సారా కాసేందుకు అవసరమైన ముడిసరుకు నల్లబెల్లం, పట్టిక జిల్లా కేంద్రం నుండి మేదరిపేట అడ్డాగా రవాణా అవుతోంది. ఏదైనా పండగ వచ్చిందంటే చాలు నాటు సారా కాసే ముడి సరుకు లక్షల్లో అమ్ముడు పోతోంది. బెల్లం, పటికతో పాటు ప్రాణాంతకమైన యూరియా గుళికలతో సైతం నాటు సారా తయారు చేస్తూ సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

మేదరిపేట అడ్డాగా నల్లబెల్లం రవాణా

మేదరిపేట పంచాయతీ వ్యాపారాకి అడ్డగా మారిందని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రం నుంచి నేరుగా అర్ధరాత్రి మేదరపేటలోని పలు దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. వ్యాపారస్తులు సైతం తెలివిగా తమ దుకాణాల్లో సరుకు నిలువ చేసుకోకుండా గుట్టుగా తమ ఇళ్లల్లో అక్రమ నల్లబెల్లం, పటికను దాస్తున్నట్లు సమాచారం. ఇక్కడ నుండి సమీప గ్రామాలతో పాటు జన్నారం మండలానికి చెందిన సమీప గ్రామాలకు సైతం నిత్యం నాటుసారకాసేందుకు అవసరమైన ముడిసరుకు రవాణా అవుతోంది.

నిత్యం ఎక్సైజ్ శాఖ అధికారుల తనిఖీలు

ప్రతిరోజు లక్షెట్టిపెట్ ఎక్సైజ్ శాఖ అధికారులు గ్రామాల్లో కలివిడిగా తిరుగుతున్నారు. నాటు సారా కాస్తున్న వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారు. హెచ్చరికలు జారీ చేస్తూ బైండోవర్లు సైతం చేస్తున్నారు. కానీ నాటు సారా కాసేందుకు అవసరమైన ముడిసరుకు నల్లబెల్లం, పటిక రవాణా చేస్తున్న వారిపై ఇప్పటివరకు ఒక కేసు కూడా నమోదు చేయలేదు. కనీసం సమాచారం ఉన్న దుకాణాల్లో తనిఖీలు చేసిన దాఖలాలు కూడా లేవు. దీంతో అక్రమ వ్యాపారస్తుల ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. నాటు సారా కాసేవారిపై దాడులు చేస్తున్నట్లే అక్రమ నల్లబెల్లం, పట్టిక దందా చేస్తున్న వారిపై కూడా కేసులు నమోదు చేస్తూ నల్లబెల్లం, పటిక దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

- బీఆర్ఎస్ నాయకుల నిరసన



నవతెలంగాణ-జైపూర్

ఎప్పటికప్పుడు పెంచుతున్న వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బలమూరి అరవిందరావు, ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మన్, జెడ్పీటీసీ మేడి సునిత తిరుపతితో కలిసి సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు మండల కేంద్రంలో 63వ జాతీయ రహదారిపై బైటాయించారు. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచుతుండటం సామాన్యులకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఖాళీ గ్యాస్ సిండర్లతో నిరసన ప్రదర్శన చేశారు. రోడ్డుపై వంటావార్పు చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే స్పందించాలని, పేదలకు గుదిబండగా మారిని గ్యాస్ సిలిండర్ల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

తలమడుగు : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల పరిపాలనలో రూ.400 ఉన్న సిలిండర్ ధరను రూ.1300 వరకు పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భార మోపిందని, ధరలు తగ్గించే వరకూ పోరాటం చేస్తామని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్ అన్నారు. గురువారం సుంకిడిలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మోడీ ప్రభుత్వం ఆర్థికంగా నష్టపరిచే విధంగా ధరలు పెంచుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ధరలు తగ్గించి ఎన్నికలు అయిన తర్వాత ధరలు పెంచి సామాన్యులపై భారం మోపడం భావ్యం కాదన్నారు. ఆదానీ, అంబానీల కొమ్ము కాస్తున్నా బిజెపి ప్రభుత్వం విమాన ఇంధన ధరలు తగ్గించి సామాన్యులపై భారం మోపుతోందని మండిపడ్డారు. వంట గ్యాస్ ధరలు తగ్గించే వరకు పార్టీ తరఫున పోరాటం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, సర్పంచ్ మహేందర్ యాదవ్, పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి చంటి, పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్లా, ప్రకాష్, లక్ష్మణ్, శాస్త్రి, గజానన్, పొచ్చన్న, చినబాపు, నర్సిములు పాల్గొన్నారు.

గుడిహత్నూర్ : పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలకు నిరసనగా మండల వ్యాప్తంగా అధికార బీఆర్ఎస్ ఆందోళనలు చేపట్టింది. బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు కరాడ్ బ్రహ్మానంద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చాక వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని మండిపడ్డారు. గ్యాస్ సిలిండర్లు, కట్టెల మోపులతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దిలీప్, జలంధర్, సలీంఖాన్, సంతోష్‌గౌడ్, సత్యరాజ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తి స్థాయిలో పనిచేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని పిల్లల సంక్షేమం దిశగా అంగన్వాడి కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయితో కలిసి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 973 కేంద్రాలు ఉండగా అందులో సొంత భవనాలు ఉండి విద్యుత్ సౌకర్యం కలిగిన సెంటర్లకు మొదటి విడతలు 100 కేంద్రాలలో టీవీలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి కేంద్రంలో భవనాలకు పెయింటింగ్, ఆట వస్తువులు, నిర్వహణ సరిగ్గా ఉండాలని, ప్రతి కేంద్రానికి విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సావిత్రి పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



నవతెలంగాణ-మంచిర్యాలటౌన్

మంచిర్యాల మున్సిపల్ 2023-అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్ అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే నడిపల్ల దివాకర్ రావు పాల్గొని మాట్లాడారు. ప్రణాళిక బద్ధంగా మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కౌన్సిల్‌కు సూచించారు. సాధరణ గ్రాంట్లు ఆదాయం కింద రూ.32 43.96 లక్షలు క్యాపిటల్ ఆదాయం కింద గ్రాంట్లు రూ.22 61.03 లక్షలు, డిపాజిట్లు అడ్వాన్స్ కింద రూ.33 80 లక్షలతో మొత్తం రూ.22 94.83 లక్షల ఆదాయాన్ని బడ్జెట్‌లో రూపొందించారు. సాధారణ నిధులు ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా సాధారణ వ్యయం రూ.2568.13 లక్షలు, క్యాపిటల్ వ్యయం రూ. 675.83, డిపాజిట్లు అడ్వాన్సులు లక్షల కాగా మిగులు బడ్జెట్ రూ.1801.27 లక్షల ఆదాయాన్ని రూపొందించగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యతో పాటు అదనపు కలెక్టర్ రాహుల్, మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.

పేద ప్రజలపై కేంద్రం వివక్ష మానుకోవాలి



నవతెలంగాణ-కడెం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద ప్రజల పొట్ట గొట్టే పనులు మానుకోవాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో గ్యాస్ ధరల పెంపుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలపై వివక్ష చూపిస్తోందని అన్నారు. నిత్యావసర ధరలు పెంచేస్తూ పోతుంటే ప్రజలు ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫిక్ అహ్మద్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్ కానురి సతీష్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు మంగ, కరుణ, రాజేశ్వరి, అశ్విని, గీత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండలం బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గ్యాస్ ధరలను పెంచడం పట్ల ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు గ్యాస్ ధరలను పెంచి, చేదు బహుమతిని ఇచ్చారని పేర్కొన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షులు అంకుష్, మండల యువజన సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, జగదీష్, ప్రకాష్, సాయి చైతన్య, నర్సరెడ్డి, నాగోరావు, కృష్ణ, సాయన్న, రమేష్, సంజయ్, కవీందర్ పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ మార్పులు తెలుసుకోవాలి

- దరఖాస్తులకు మార్చి 15 గడువు
- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్మీ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకునే యువకులు రిక్రూట్‌మెంట్లో జరిగిన మార్పులను తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి కల్నల్ కే దాస్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఆర్మీలో భర్తీ కోసం ముందుగా మెడికల్, ఫిజికల్ పరీక్షలు నెగ్గితే తరువాత రాత పరీక్ష ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం ఆర్మీలో భర్తీ కోసం కొత్త నిబంధనలను తీసుకొచ్చారని, వాటి గురించి అభ్యర్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గత సంవత్సరం నిర్వహించిన ర్యాలీలో రాష్ట్ర వ్యాప్తంగా 808 మంది ఎంపిక కాగా అందులో 300కు పైగా 30 నుంచి 40 శాతం వరకు జిల్లా యువకులే ఉన్నారన్నారు. వారి సౌకర్యార్థం భర్తీ ప్రక్రియలో వచ్చిన మార్పులపై అవగాహన కల్పించేలా జిల్లా యంత్రాంగం విస్తృత ప్రచారం కల్పిస్తుందన్నారు. రిక్రూట్మెంట్ అధికారి కల్నల్ కే దాస్ మాట్లాడుతూ అగ్నివీర్‌తో పాటు ఆర్మీలోని ఇతర పోస్టులకు రిక్రూట్మెంట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 16 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ మార్చి 15తో గడువు ముగుస్తుందన్నారు. దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. ఈ సారి పరీక్షల నిర్వహణ ఆన్‌లైన్ విధానంలో ఉంటుందన్నారు. గతంలో ఉన్న సిలబస్ ఉంటుందని, దాంట్లో ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. యువత మార్పులను గమనించి అవగాహన పెంచుకుంటూ ఆర్మీ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కెరమెరి

ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ పెందూర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మకి ద్రుపతబాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబ్దుల్ కలాం తదితరులు కేక్ కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. అనంతరం పెట్రోల్ బంక్, బస్టాండ్ ప్రాంతంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాథోడ్ ఉత్తంనాయక్, సాంగ్వి సర్పంచ్ జగన్నాథ్‌రావ్, శివాజీ పాల్గొన్నారు.

రెబ్బెన: ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నవీన్‌కుమార్ జైస్వాల్ తల్లి కమల జైస్వాల్ రెబ్బెన గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానానికి రూ.లక్ష విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ప్యాక్స్ చైర్మన్ కార్నాదం సంజీవ్, సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, బీఆర్ఎస్ అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, ప్యాక్స్ వైస్ చైర్మన్ రంగు మహేష్‌గౌడ్, ఎంపీటీసీ మధునయ్య, ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్‌గౌడ్, నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్, కోఆప్షన్ సభ్యుడు జహీరొద్దీన్, మహిళా మండలాధ్యక్షురాలు అరుణ, నాయకులు శంకరమ్మ, శ్రీధర్, రాజేష్, అజయ్ జైస్వాల్, నవీన్ జైస్వాల్, మాన్యం పద్మ, ఆశన్న, మురళీగౌడ్, శంకర్, నర్సింగరావు, శ్రీనివాస్, భుజంగరావు, రాపర్తి అశోక్, స్వామి, సంజీవ్ జైస్వాల్, రాజాగౌడ్, దుర్గం రాము, రవీందర్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ మురళీగౌడ్ ఆధ్వర్యంలో సక్కు పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించేలా కష్టపడి చదవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేలా కష్టపడి చదువుతూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ ఎన్యువల్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేమేందర్ మాట్లాడుతూ కళాశాలలో నాణ్యమైన విద్యా బోధన అందిస్తూ అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఇక్కడి విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించడం హర్షనీయమని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగానే ఐటీ రంగంలో ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అవకాశాలను వినియోగించుకుంటూ జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలకు అనుగుణంగా జాతీయ జెండాను చేతపట్టుకుని విద్యార్థినులు నృత్య ప్రదర్శనలు చేశారు. అదేవిధంగా సినీ, జానపద గీతాలకు తగ్గట్లుగా చేసిన ప్రదర్శనలు అలరించాయి. తోటి విద్యార్థినుల కేరింతల నడుమ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. కార్యక్రమంలో డీఐఈఓ రవీందర్, ప్రిన్సిపాల్ భగవాండ్లు, లెక్చరర్లు సరిత, ప్రేంరెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎల్ఐసీ ఏజెంట్ రామచంద్రారెడ్డి మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



గుండెపోటుతో ఎల్ఐసీ ఏజెంట్ల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి గురువారం ఉదయం శేషాచలంలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు తిరుపతి దర్శనం చేసుకొని తమిళనాడులోని శేషాచలం వెళ్లే సమయంలో హఠాత్తుగా ఉదయం 5 గంటలకు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందనట్టు తెలిపారు. మృతి చెందిన సమాచారం తెలియగానే తోటి ఎల్ఐసీ ఎజెంట్లు దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ మధ్య కలుపుగోలుగా ఉండే వ్యక్తి ఆకస్మత్తుగా దూరమవడంతో ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రక్తదానంతో ప్రాణ దాతలు కావాలి

నవతెలంగాణ-తాండూర్

అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. గురువారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సురభి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేయడంతో తలసీమే వ్యాధిగ్రస్తుల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని జన్నారం, చెన్నూరు, కన్నెపల్లి, తాండూరు మండలాల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మంచిర్యాల జిల్లాలో ఎనిమిది వందల మంది తలసీమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారని తెలిపారు. వారికి నెలకు 400 యూనిట్ల రక్తం అవసరమవుతుందని పేర్కొన్నారు. సింగరేణి, రెవెన్యూ, పోలీస్ స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహంతో ప్రతి నెల రక్త నిధులను సేకరించి రెడ్ క్రాస్ సొసైటీకి డొనేట్ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీఓ శ్యామలాదేవి, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఎంఈఓ ప్రభాకర్, జడ్పీటీసీ బానయ్య పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీలో కుక్కల దాడిలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు

బాసర : ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో కుక్కల దాడిలో ఇద్దరు విద్యార్థులు గాయాల పాలైనట్లు గురువారం యూనివర్సిటీ పీఆర్ఓ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులు తరగతి గదుల నుండి హాస్టల్‌కు వెళ్లే గ్రామంలో కుక్కలు దాడి చేశాయన్నారు. దీంతో స్వల్ప గాయాలయ్యాయని, యూనివర్సిటీలోని ఆసుపత్రిలో విద్యార్థులకు చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రమాదం లేదని వైద్యులు ధ్రువీకరించారని తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు సైతం హాజరయ్యారని తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే సక్కు



ఆసిఫాబాద్: ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా నియోజకవర్గ అభివృద్ధికి త్వరలో ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేయనున్నట్లు సీఎం హామీ ఇచ్చారని ఎమ్మెల్యే వివరించారు.

గూడ అంజన్న యాదిలో మహాసభ పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీపీఐ ప్రజా సంఘం తెలంగాణ ప్రజానాట్యమండలి మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో గూడ అంజన్న యాదిలో మహా పోస్టర్ జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్ మాట్లాడుతూ గూడ అంజన్న యాదిలో మార్చి 5న ఊరు మనదిరా. వాడ మనది రా అనే పోరుబాట నీరాజనం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బెల్లంపల్లి పట్టణంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, యుద్ధ నౌక గద్దర్, కళాకారులు మిట్టపల్లి సురేందర్, వందేమాతరం శ్రీనివాస్, విప్లవ చిత్రాల హీరో ఆర్ నారాయణమూర్తి, రాంబాబు, విజయ, జయరాజ్, కోదండరామ్, మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. పాట ప్రజల్లో బతికే ఉందని, పాటలతో నాలుగు కోట్ల ప్రజలను ఏకం చేసి తెలంగాణా సాధించడం జరిగిందని, అలాంటి కళాకారుడు గూడ అంజన్న మరణం తీరని లోటని, కళాకారుడు అంజన్న యాదిలో జరిగే బహిరంగ సభలో ప్రముఖులు తెలంగాణలో జరుగుతున్న వివక్ష, అణిచివేతపై వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బోగే ఉపేందర్, ఆత్మకూరి చిరంజీవి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు సత్తయ్య పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కడెం

మండలంలోని ఎలగడప, ధర్మాజిపేట్, పెద్ద బెల్లాల్, గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖా శ్యామ్ నాయక్ కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేద కుటుంబాల్లోని ఆడపడుచులకు, అండగా ఉంటూ కళ్యాణలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. అనంతరం కొండుకూర్‌లోని ఎస్‌కె ఫంక్షన్ హాల్‌లో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్ ఉచిత శిక్షణ తీసుకున్న మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం కొండుకూర్, నవాబ్‌పేట్, లక్ష్మీపూర్, ఉడుంపూర్ గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కడెం మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫిక్ అహ్మద్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మెన్ కానురి సతీష్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ గౌడ్, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే మెస్ ఛార్జీలు పెంపు

ఆసిఫాబాద్ : ఎస్ఎఫ్ఐ చేసిన పోరాటాల ఫలితంగానే మెస్ చార్జీల పెంపు జరిగిందని, కానీ పెంచిన ఛార్జీలు నామమాత్రంగానే ఉన్నాయని పెరిగిన ధరలకనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెస్ చార్జీల పెంపు ఆహ్వానించదగినది అయినప్పటికీ కాస్మోటిక్ చార్జీలు పెంచకపోవడం దారుణమన్నారు. మెస్ ఛార్జీలు అవసరానికి అనుగుణంగా పెంచడంతోపాటు వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలన్నారు. మెస్ ఛార్జీలు పెంచాలని రాష్ట్ర వ్యాప్తంగా 27 జిల్లాలో 23,571 కి.మీ పాటు సైకిల్ యాత్రలు, బైక్ యాత్రలు చేసి హాస్టల్స్ సందర్శించి సమస్యలు వెలుగులోకి తీసుకువచ్చి దశలు వారిగా ఆందోళన చేసినట్లు వివరించారు. నిత్యావసర ధరల పెరుగుదలకు కనుగుణంగా చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.